
సాక్షి బాపట్ల

ఆదివారం ‌। 4 ‌। మే ‌। 2025



వైభవంగా తిరుపతమ్మ తిరునాళ్ల

బాపట్ల: జమ్ములపాలెంలోని త్రిశక్తి ఆలయంలో గోపయ్య సమేత తిరుపతమ్మ తిరునాళ్ల మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లకు విశేష పూజలు, అర్చనలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 514.00 అడుగుల వద్ద ఉంది. ఇది 138.5810 టీఎంసీలకు సమానం.



అలరించిన భక్తిగీతాలాపన

నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తిగీతాలాపన నిర్వహించారు. గాయని అంజనీదేవి బృందం కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు.

తీరం భూములనూ వదలట్లేదు

- చీరాల పచ్చనేత భూ దందా
- రామచంద్రాపురం తీరంలో భూ ఆక్రమణ
- సముద్రం నీటి వరకూ భూమి తనదేనంటున్న ప్రజాప్రతినిధి
- సీఆర్‌జెడ్ నిబంధనలకు తూట్లు
- దశాబ్దాలుగా వేట సాగిస్తున్న మత్స్యకారులు
- చేపలు ఎండబెట్టుకొనేందుకు నిర్మించుకున్న ప్లాట్‌ఫారాలు ధ్వంసం
- లబోదిబోమంటున్న మత్స్యకారులు



చీరాల పచ్చనేతలు ఆక్రమించిన భూమి

సాక్షి ప్రతినిధి,బాపట్ల: చీరాల పట్టణానికి చెందిన పచ్చ ప్రజాప్రతినిధి బరితెగించారు. బాపట్ల మండలం అడవి పంచాయతీలోని రామచంద్రాపురం ప్రాంతంలో సుమారు 40 ఎకరాల భూములుకొన్న సదరు నేత ఈ ప్రాంతంలో ఏకంగా సముద్రతీరాన్ని ఆక్రమించారు. ఎంతగా అంటే తీరం అలల వరకూ సముద్రమే తనదంటున్నాడు. పచ్చనేత భూమిలో చాలామటుకు ప్రభుత్వ భూమి ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. దశాబ్దాలుగా చేపల వేట సాగిస్తున్న రామచంద్రాపురం మత్స్యకారులు చేపలు ఎండబెట్టుకునేందుకు తీరంలో నిర్మించుకున్న ప్లాట్‌ఫారాలను పచ్చనేత అనుచరులు ధ్వంసం చేశారు. ఇదేం దుర్మార్గమని ప్రశ్నించిన మత్స్యకారులను బెదిరించారు. పూర్వీకుల కాలం నుంచి ఇక్కడే పడవలు పెట్టుకొని వేట సాగిస్తున్నామని మత్స్యకారులు చెప్పినా ఆయన వినిపించుకోలేదు. ఇకనుంచి తీరంలో బోట్లు పెడితే సహించేదిలేదని, వాటిని సముద్రంలో పడేస్తామని హెచ్చరించారు. పచ్చనేత అనుచరుల ఆగడాలు భరించలేక మత్స్యకారులు రెవెన్యూ అధికారులతోపాటు పలుమార్లు మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక వారు లబోదిబోమంటున్నారు. పచ్చనేత దౌర్జన్యం ఇప్పుడు చీరాలతోపాటు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేత వేటపాలెం మండలంలో పొట్టిసుబ్బయ్యపాలెం సముద్ర తీరంలోనూ పెద్ద ఎత్తున ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు సమాచారం.

ప్రజాప్రతినిధి బాటలో చోటా నేతలు

చీరాల ప్రజాప్రతినిధిని ఆదర్శంగా తీసుకున్న పలువురు పచ్చనేతలు తీరంవెంబడి పెద్ద ఎత్తున ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమించారు. కొందరు ఇప్పటికే వాటిల్లో రిసార్ట్‌లు, గెస్ట్‌హౌస్‌లు నిర్మించుకోగా మరికొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ సదరు భూములు, స్థలాలను ఇతరులకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు.



సముద్రం అనుకొని వేసిన వెంచర్

ఇక్కడ కొందరు రెవెన్యూ అధికారులు మీకింత మాకింత అనే పద్ధతిలో వ్యాపారం సాగిస్తున్నారు.

తీరంలో భూములకు డిమాండ్

వాస్తవానికి సముద్ర తీరంలో సీఆర్‌జెడ్ నిబంధనల మేరకు సముద్ర తీరానికి పోటు సమయంలో నీటి అలలు ఎంతవరకు వస్తాయో అక్కడి నుంచి 200 మీటర్ల వరకూ మత్స్యకారులు చేపలవేట సాగించడంతోపాటు ఇందుకు అనుగుణంగా పడవలు, బోట్లు, వలలు ఉంచుకునేందుకు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకోవచ్చు. చేపలు ఎండబెట్టుకునేందుకు ప్లాట్‌పాంలు నిర్మించుకోవచ్చు. ఆ తర్వాత 500 మీటర్లలోపు శాశ్వత నిర్మాణాలు ఉండకూడదు. రిసార్ట్ బిజినెస్‌కు డిమాండ్ పెరగడంతో బిజినెస్‌మెన్‌లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, రిటైర్డ్ ఉద్యోగులు, సినిమా పరిశ్రమకు చెందినవారు సముద్ర తీరంలో భూములు కొని రిసార్ట్‌లు నిర్మించడం లేదా రియల్ ఎస్టేట్ ద్వారా క్రయవిక్రయాలు చేస్తుండడంతో తీరంలో భూములకు డిమాండ్ పెరిగింది.

సముద్రం మాదేనంటున్నారు



మేము చిన్నప్పటి నుంచి సముద్రంలో చేపల వేట చేసుకొని బతుకుతున్నాం. మా పెద్దల కాలం నుంచి ఇక్కడే తీరంలో బోట్లు పెట్టుకుంటాం. వలలు పాడైనా ఇక్కడే ఉండి తయారు చేసుకుంటాం. చేపలు తెచ్చి ఇక్కడే ఆరబోసుకొని అమ్ముకుంటాం. చీరాల నాయకుడంట ఆయన ఇక్కడ భూములు కొని ఈ సముద్రాన్ని ఆక్రమించాడు. మమ్మల్ని ఇక్కడి నుంచి వెళ్లిపొమ్మన్నాడు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు.

– కుర్రా అగ్గియ్య, మత్స్యకారుడు, రామచంద్రాపురం.

సముద్రాన్ని వదలి మేమెక్కడికెళ్లాలి



సముద్రమే మాకు అన్నం పెట్టే తల్లి. మా బతుకు సముద్రమే. ఎవరో నాయకులు వచ్చి సముద్రం మాదని ఆక్రమిస్తే మేమెక్కడికెళ్లాలి. మేము చేపలు ఎండబెట్టుకునేందుకు నిర్మించుకున్న ప్లాట్‌ఫారంలు కూలగొట్టారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. మా గోడు వినేవారు లేరు. సముద్రం దాకా వాళ్లకు భూములెట్ట ఇస్తున్నారో? తెలియడంలేదు.

– వాయిల తిరుపతి, మత్స్యకారుడు, రామచంద్రాపురం.

మత్స్యకారులకు కష్టాలు

ఏకంగా సముద్రతీరమే అన్యాక్రాంతమవుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. ప్రధానంగా ఆక్రమణలతో మత్స్యకారులకు ఇబ్బందులు తప్పడంలేదు. పచ్చనేతలు తీరం వరకూ భూములను ఆక్రమించడంతో చేపల వేట వారికి కష్టతరంగా మారింది. పచ్చనేతలు స్థలం తమదంటూ మత్స్యకారుల బోట్లను కూడా తీరంలో పెట్టుకోనివ్వడంలేదు.

నేతకు రెవెన్యూ అధికారుల సహకారం

చీరాల మున్సిపల్ ప్రజాప్రతినిధి వేటపాలెం మండలంతోపాటు బాపట్ల మండలం అడవి పంచాయతీలోని రామచంద్రాపురం సముద్రతీరంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి వెంచర్లు వేసి అమ్మకానికి పెట్టడం చర్చనీయాంశంగా మారింది. పచ్చనేత దందాకు కొందరు రెవెన్యూ అధికారులు సహకారమందించారన్న ప్రచారం. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తోంది. తీరంలో ఎకరం రూ.3 నుంచి రూ.5 కోట్లు పలుకుతోంది. ఈ లెక్కన చీరాల పచ్చనేత రామచంద్రాపురం వెంచర్ ఒక్కటే సుమారు రూ.150 కోట్లు ఉంటుందని అంచనా. దీంట్లో చాలామటుకు అసైన్డ్‌తోపాటు సముద్రతీరానికి చెందిన ప్రభుత్వ భూమి ఉన్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. దీనిపైన విచారణ జరిపితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశముంది.

జాతీయ రహదారి పనులు వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల: వాడరేవు–నకరికల్లు, బెంగళూరు–కడప–విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణ పనులపై రెవెన్యూ అధికారులతో శనివారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాడరేవు–నకిరికల్లు జాతీయ రహదారి 167–ఏ నిర్మాణంలో కారంచేడు, పర్చూరు, వేటపాలెం, చీరాల మండలాలలో భూ సేకరణ సమస్యలు పరిష్కరించాలన్నారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారందరికీ న్యాయబద్ధంగా నగదు చెల్లింపులు జరగాలన్నారు. చీరాల మండలంలోని ప్రభుత్వ పోరంబోకు భూమిలో నివాసముంటున్న 63 గృహాల నిర్మాణాలను తక్షణమే తొలగించాలన్నారు. చట్టబద్ధంగా వారికి రావలసిన పరిహారం అందించాలన్నారు. బెంగళూరు–కడప–విజయవాడ జాతీయ రహదారి 544–జి నిర్మాణానికి ఆటంకంగా ఉన్న భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. జె.పంగులూరు మండలంలో ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తక్షణమే సమస్య పరిష్కరించాలన్నారు. అద్దంకిలో ఆక్రమణలు తొలగించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ కారణాల చేత నష్టపరిహారం నగదు చెల్లింపులు నిలిచిపోయిన వారికి తక్షణమే అందించాలన్నారు. రహదారుల నిర్మాణంలో జాప్యం ఉండరాదని ఆదేశించారు. 16వ నంబర్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పిచ్చుకలగుడిపాడు వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ త్వరగా చేపట్టాలన్నారు. సమీపంలో ఉన్న మరో భూమి సమస్య తక్షణమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎస్‌డీసీ లవన్న, బాపట్ల, చీరాల ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగం పర్యవేక్షకులు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పెండింగ్ కేసులు పరిష్కారమయ్యేలా పనిచేయాలి



రేపల్లె: కేసులు పరిష్కరించి కక్షిదారులకు సత్వరమే న్యాయం జరిగేలా పోలీస్ అధికారులు పనిచేయాలని సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల కోరారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ హాలులో శనివారం పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పెండింగ్ కేసులను పరిష్కరించాలనే లక్ష్యంతో జూలై 7వ తేదీన జాతీయ లోకాదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులతోపాటు పరిష్కరించ దగ్గ కేసులను పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేయాలని అన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.దేవిసాయిశ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గీతాభార్గవి, డీఎస్పీ ఏ.శ్రీనివాసరావు, సీఐ మల్లికార్జునరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గరికపాటి వెంకటగిరిధర్, డివిజన్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్ల ఎస్‌ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వినూత్న చలివేంద్రం

మజ్జిగతో పాటు చెప్పులు, గొడుగులు పంపిణీ



పర్చూరు(చినగంజాం): వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి చల్లటి మంచినీటిని పాదచారులకు అందించటం ఆనవాయితీ. కొందరు ఖర్చు కాస్తం ఎక్కువ అనిపించినా మజ్జిగ అందిస్తుంటారు. కానీ పర్చూరు బొమ్మల సెంటర్‌లో పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగతో పాటు చెప్పులు, గొడుగులు అందించే కొత్త సంప్రదాయానికి ఆరంభం పలికారు. ఈ కార్యక్రమాన్ని 40 రోజులపాటు కొనసాగించనున్నారు. రోటరీ క్లబ్ చేస్తున్న ఈ సేవ చాలా అద్భుతంగా ఉందని పలువురు ప్రశంసిస్తున్నారు. క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, సభ్యులు గడ్డిపాటి శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖర్, పాబోలు వెంకన్న, నాగబైరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీలలో పలువురికి చోటు

రేపల్లె: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో బాపట్ల జిల్లాకు చెందిన పలువురికి చోటు లభించింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శిగా బాపట్లకు చెందిన అహ్మద్ హుస్సేన్, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా రేపల్లెకు చెందిన దొంతిబోయిన ప్రసాదరెడ్డిలను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అనుబంధ విభాగాలకు ఎంపికైన నాయకులను పలువురు అభినందించారు.

7న శంకర్‌విలాస్ ఆర్‌ఓబీ పనులకు శంకుస్థాపన



నెహ్రూనగర్: ఈ నెల 7వ తేదీన శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ పనుల శంకుస్థాపన జరుగుతుందని, విస్తరణ పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం అధికారులతో కలిసి శంకర్ విలాస్ ఆర్‌ఓబీ రోడ్డు విస్తరణ పనులను కమిషనర్ పరిశీలించారు. తొలుత ఆర్‌ఓబీ నిర్మాణ డిజైన్‌ను పరిశీలించి, ఇప్పటివరకు జరిగిన విస్తరణ పనులు, మార్కింగ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు ఆర్‌ఓబీ నిర్మాణ పనుల శంకుస్థాపన చేస్తారన్నారు. శంకుస్థాపన జరిగే ప్రదేశం నిర్ణయం అనంతరం శిలాఫలకం ఏర్పాట్లను ఆర్‌అండ్‌బీ అధికారుల సమన్వయంతో చేయాలన్నారు. ఎస్‌ఈ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈఈ చిన్నయ్య, ఏఈఈ సంజీవ కుమార్, ఏసీపీలు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రైతుల కష్టం చెత్త పాలు



పర్చూరులో చెత్తపాలైన పొగాకు



రోడ్డు మార్జిన్‌లో పడవేసిన పొగాకు

పర్చూరు(చినగంజాం): రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పొగాకు గిట్టుబాటు ధర లేక చెత్తపాలైంది. గత ఏడాది లాభాలు చవిచూసిన రైతులు ఈ ఏడాది అప్పు తెచ్చి పొగాకు సాగు చేశారు. గిట్టుబాటు ధర కాదు గదా, కనీసం సాగు ఖర్చులు కూడా రాక, కోల్డ్ స్టోరేజ్‌లో భద్ర పరిచే స్థోమత లేక రోడ్డు వెంట చెత్తలో పడవేసిన దృశ్యం పర్చూరులో శనివారం కనిపించింది. కూటమి ప్రభుత్వం హయాంలో ఇలాంటి దురదృష్టకర సంఘటనలను చూడాల్సి వస్తోందని ఊహించని రైతులు కుమిలిపోతున్నారు.

'నీట్'కు పటిష్ట ఏర్పాట్లు

చీరాల అర్బన్: నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)–2025 పరీక్షను ఆదివారం స్థానిక వైపీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో రెండు సెంటర్లలో నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ, పరీక్షల నిర్వహణ సెంటర్ కో–ఆర్డినేటర్ టి.చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. పరీక్షల ఏర్పాట్లపై శనివారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. నీట్ పరీక్ష కేంద్రం దూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లకు వంద మీటర్ల దూరంలో ఉందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచే అనుమతిస్తారని, మధ్యాహ్నం 1.30 గంటలకు గేట్లు మూసివేస్తామని తెలిపారు. విద్యార్థులను పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించమన్నారు. విద్యార్థులు అడ్మిట్ కార్డు, ఐడీ ప్రూఫ్ (ఆధార్) తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. లేనివారిని పరీక్ష కేంద్రంలోనికి అనుమతించమన్నారు. మూడు పేజీల అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకుని మొదటి పేజీలో సెల్ఫ్ డిక్లరేషన్, రెండో పేజీలో పోస్ట్‌కార్డు సైజు ఫోటో అంటించుకుని తీసుకురావాలన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం రెండు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. సమీక్ష సమావేశంలో చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ, డీఎల్‌పీఓ, విద్యుత్, విద్యాశాఖ అధికారులు, కాలేజీ ప్రిన్సిపాల్ హాజరయ్యారు.



అధికారులుతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు

వైభవంగా పునఃప్రతిష్టా మహోత్సవాలు

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలోని కేఆర్ కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో పునఃప్రతిష్టా మహోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం రెండవ రోజు నిత్యపూజావిధులు, వాస్తుపూజ, బలిపర్యగ్నీకరణ విధులు, ప్రభాతబలి, లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం, జలాధివాసం, క్షీరాధివాసం, అదివాసహోమాలు జరిగాయి. భక్తులు బిందెలతో నీటిని తెచ్చి స్వయంగా విగ్రహాలకు అభిషేకం చేశారు. దేవస్థాన ఈఓ కె.సునీల్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



నేడు రేపల్లె ప్యాసింజర్ రైళ్లు రద్దు

తెనాలిరూరల్: తెనాలి పట్టణంలోని మారీస్‌పేట మొండిగోడల వద్ద పినపాడు కాల్వపై వంతెన నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో తెనాలి–రేపల్లె మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను ఆదివారం రద్దు చేసినట్టు తెనాలి రైల్వేస్టేషన్ మేనేజర్ టీవీ రమణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు–రేపల్లె (67249), రేపల్లె–గుంటూరు(67250), గుంటూరు–రేపల్లె(67223), రేపల్లె–గుంటూరు(67224), తెనాలి–రేపల్లె(67231), రేపల్లె–తెనాలి(67232), తెనాలి–రేపల్లె(67233), రేపల్లె–తెనాలి(67234) రైళ్లను రద్దు చేసినట్టు చెప్పారు. విజయవాడ–తెనాలి(67221) రైలును గుంటూరుకు మళ్లిస్తారని, సికింద్రాబాద్ నుంచి రేపల్లె(17645) వెళ్లే ప్యాసింజర్ రైలు గంట ఆలస్యంగా నడుస్తుందని తెలిపారు.

స్వర్ణ ప్రకాశ రూపిణిగా బగళాముఖి అమ్మవారు

చందోలు(కర్లపాలెం): చందోలులోని బగళాముఖి అమ్మవారు పురాతన సువర్ణాభరణాల అలంకరణతో స్వర్ణ ప్రకాశరూపిణిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో స్వయంభూవై వెలసిన బగళాముఖి అమ్మవారి వార్షిక కొలుపులు(తిరునాళ్ల) అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. కొలుపులలో నాల్గవ రోజు అమ్మవారికి పురాతన బంగారు ఆభరణాలను అలంకరించారు. ముందుగా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.భాగ్యలక్ష్మి, ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి పర్యవేక్షణలో బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ, ఎస్‌ఐ ఎం.శివకుమార్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించగా ముఖ్య అతిథులు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, పురాతన బంగారు నగల పరిరక్షణ కమిటీ సభ్యులు, పంచాయతీ, రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు చందోలు స్టేట్ బ్యాంకులో భద్రపరిచి ఉన్న అమ్మవారి పురాతన నగలను బ్యాంకు అధికారుల సమ్మతితో లాకరు నుంచి బయటకు తీసి భక్తుల జయజయ ధ్వానాల మధ్య బ్యాంకు నుంచి శోభాయాత్రగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి పురాతన బంగారు ఆభరణాలను అలంకరించారు. తెలుగు రాష్ట్రాలలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వర్ణాభరణాల అలంకరణతో దేదీప్యమానంగా వెలుగుగొందుతున్న బగళాముఖి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. అమ్మవారి ఆలయ ముఖమండపం నిర్మించేందుకు 2002 డిసెంబర్ నెలలో జరిపిన తవ్వకాలలో దొరికిన పురాతన బంగారు నగలను వార్షిక కొలుపులలో నాల్గవ రోజున మాత్రమే అలంకరించటంతో పురాతన బంగారు నగల అలంకరణలో ఉన్న అమ్మవారిని చూసేందుకు భక్తులు తండోపతండాలుగా ఆలయానికి తరలివచ్చారు. భక్తుల దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం తిరిగి బంగారు నగలను పోలీసు బందోబస్తుతో బ్యాంకుకు తీసుకువెళ్లి లాకరులో భద్రపరిచారు.



పురాతన బంగారు ఆభరణాలను ఆలయానికి తీసుకువస్తున్న దృశ్యం



బంగారు ఆభరణాల అలంకరణలో అమ్మవారు

సందేశాత్మకం.. ఉత్సాహభరితం

కొనసాగుతున్న ఆహ్వాన నాటిక పోటీలు

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరులో కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో జరుగుతున్న ఉభయ రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు శనివారం కొనసాగాయి. తాళ్లూరు శ్రీనివాసరావు కళాప్రాంగణంలో తొలుత తాళ్లూరు సురేష్ జ్యోతి ప్రజ్వలనతో రెండోరోజు ప్రదర్శనలను ప్రారంభించారు. తొలుత విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారి 'స్వేచ్ఛ' నాటికను ప్రదర్శించారు. స్వేచ్ఛ అనేది విశృంఖలానికి దారితీయకూడదు. స్వేచ్ఛ హద్దు ఉంటేనే ముద్దుగా వుంటుంది... లేకుంటే పర్యవసానాలు దారుణంగా ఉంటాయని హెచ్చరించిందీ నాటిక. పీఎస్ నారాయణ మూలకథకు పరమాత్ముని శివరాం నాటకీకరణ చేయగా, బీఎం రెడ్డి దర్శకత్వం వహించారు. ప్రధాన పాత్రల్లో సురభి లలిత, సింధు, ఏపూరి శ్రీనివాస్, వెంకట్ గోవాడ నటించారు.

ధైర్యం చెప్పే 'బ్రహ్మ స్వరూపం'

రెండో ప్రదర్శనగా మైత్రీ కళానిలయం, విజయవాడ వారి 'బ్రహ్మస్వరూపం' నాటికను ఆడారు. కఠినమైన సందర్భాల్లో విధి విరోధిగా మారినపుడు మనం నిస్సహాయులుగా మిగిలిపోతున్నపుడు సాక్షాత్తూ ఆ బ్రహ్మస్వరూపం ఆవహించి ధర్మాన్ని చెబుతుందని ధైర్యం చెప్పిందీ నాటిక. స్నిగ్ధ రచించిన నాటికకు టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించారు. ప్రధాన పాత్రల్లో టీవీ పురుషోత్తం, శ్యామ్, వీసీహెచ్‌కే ప్రసాద్, ఎం.రత్నకుమారి, ఆర్.రాజేశ్వరి నటించారు. చివరగా యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారి '27వ మైలురాయి' నాటికను ప్రదర్శించారు. పీటీ మాధవ్ రచించిన నాటికకు ఆర్.వాసు దర్శకత్వం వహించారు.

రత్నకుమారికి జీవిత సాఫల్య పురస్కారం

రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షతన జరిగిన సభలో ఒంగోలుకు చెందిన ప్రముఖ రంగస్థల నటీమణి ఎం.రత్నకుమారికి గోపరాజు హేమలత జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. గోపరాజు శివరామకృష్ణ, హనుమత్ శేఖర్, కుటుంబసభ్యుల చేతులమీదుగా ఈ గౌరవాన్ని అందజేశారు. విశాఖపట్నంకు చెందిన నటుడు, దర్శకుడు చలపాని శివప్రసాద్, కొల్లిపరలోని శ్రీకళానిలయం వ్యవస్థాపకుడు బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఇదే వేదికపై రాష్ట్రస్థాయి రచనల పోటీల విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. రంగస్థల ప్రముఖులు దేవిరెడ్డి రామకోటేశ్వరరావు, డీవీ చంద్రశేఖర్ (న్యూఢిల్లీ), పీవీత్యనారాయణ (గుడివాడ), గంటా ముత్యాల నాయుడు (కొంతేరు), పి.శివప్రసాద్ (గుంటూరు), వల్లూరు వరప్రసాద్, నల్లిబోయిన నాగేశ్వరరావు మాట్లాడారు. గోపరాజు రమణ, గోపరాజు విజయ్, సుద్దపల్లి మురళీధర్ పర్యవేక్షించారు.



ఎం.రత్నకుమారికి జీవితసాఫల్య పురస్కారం



'స్వేచ్ఛ' నాటికలో సన్నివేశం

క్లుప్తంగా

హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



రేపల్లె: హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సమరత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. నిజాంపట్నంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం జరిగిన సమరత సేవా ఫౌండేషన్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణ లక్ష్యంగా సమరత సేవా ఫౌండేషన్, టీటీడీ శ్రీవాణి ట్రస్టుల ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో భక్తి భావం పెంపొందిస్తున్నామన్నారు. హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 18వ తేదీన గరువుపాలెం నుంచి నగరం వరకు జరిగే హనుమాన్ శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మహిళా కన్వీనర్ కొత్తగుండు సుగునార్దిని, సభ్యులు అక్కల సుబ్బారెడ్డి, పాండురంగారావు, మహేంద్రకుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి



యద్దనపూడి: రోడ్డు ప్రమాదంలో సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటన యద్దనపూడి మండలం లోని గన్నవరం–మార్టూరు దండు దారి మధ్య శనివారం మధ్యాహ్నం జరిగింది. ఎస్సై రత్నకుమారి, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన భట్టు రవికృష్ణ (38) అసోంలోని 30వ బెటాలియన్‌లో సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 15 రోజుల క్రితం సెలవులపై స్వగ్రామం పూనూరు వచ్చాడు. శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంపై మార్టూరు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇది ఇలా ఉండగా ద్విచక్ర వాహనం రోడ్డు కుడి వైపున పడి ఉండటం గమనార్హం. ఏదైనా భారీ వాహనం వేగంగా రావటంతో దానిని తప్పించబోయే క్రమంలో ఈ ప్రమాదం జరిగి ఉంటుందేమోనని పోలీసులు భావిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

మహిళా లోకం కస్సుబస్సు

నోరు ఉంది కదా అని ఎడాపెడా వాగ్దానాల జాబితా చదివిన కూటమి ప్రభుత్వం నేడు హామీలు అమలు చేయకుండా చేతులెత్తేస్తోంది. గెలుపే పరమావధిగా నాడు చేసిన వాగ్దానాలే.. నేడు వారి ఓటమికి మెట్లుగా మారక తప్పదని మహిళలంతా నిరసన వ్యక్తం చేస్తున్నారు.

- మహా మాయగా కూటమి వాగ్దానం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎక్కడ?
- చీరాల నియోజవర్గం లో 1,04,002 లక్షల మంది ఎదురు చూపులు



ఆర్టీసీలో ప్రయాణిస్తున్న మహిళలు

వేటపాలెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు పూర్తయినప్పటికీ మహిళలకు ఉచిత బస్సు హామీపై స్పష్టత రాకపోవడంపై వారంతా మండి పడుతున్నారు. నాటి ఎన్నికల వాగ్దానంలో భాగంగా మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పడంతో వారంతా బాబును నమ్మారు. తీరా చూస్తే తాము మోసపోయినట్లు ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నారు.

చీరాల నియోజ కవర్గంలో 1,04,002 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కాగా చీరాల టౌన్‌లో 35,352 మంది.. చీరాల రూరల్ ప్రాంతంలో 35,119 మంది ఉన్నారు. అలాగే వేటపాలెం మండల పరిధిలో 31,296 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా నిత్యం పలు గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలైతే వీరంతా అర్హులే. చీరాల ఆర్టీసీ డీపో నుంచి ప్రతి రోజు 82 బస్సు సర్వీసులు నడుస్తుంటాయి. వీటి ద్వారా ప్రతి రోజూ రూ. 15 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఇందులో మహిళల వాటా యాభై శాతం అనుకున్నా ఆ మేర ప్రభుత్వం ద్వారా వీరందరికీ నష్టం వస్తున్నట్లే.

కాలేజీ విద్యార్థినులకు తీవ్ర నష్టం

ఇక కాలేజీలకు వెళ్లే విద్యార్థినులకు అయితే ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. తల్లిదండ్రులు కాయకష్టం చేసి ఆ డబ్బుతోనే తమ పిల్లల బస్‌పాస్‌లకు డబ్బు చెల్లిస్తుంటారు. ఇంటర్ కాలేజీలు ఆరు ఉండగా.. డిగ్రీ కాలేజీలు మూడు ఉన్నాయి. వీటిలో సుమారు రెండువేల మంది విద్యార్థినులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి వారికి ఉచిత ప్రయాణం అంటే ఒక్క ఏడాదికి సరాసరిన 6000 రూపాయల దాకా ఆదా చేసే అవకాశం కలుగుతుంది. కానీ కూటమి వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది.

దుకాణాల్లో పని చేసే మహిళలు?

చీరాల వాణిజ్య కేంద్రంగా విరాజిల్లుతోంది. ముఖ్యంగా వందలాది వస్త్ర దుకాణాల్లో సుమారు రెండు వేలమంది మహిళలు జీవనోపాధి పొందుతుంటారు. రూ.7 వేల నుంచి రూ. 10 వేల లోపే వారికి వేతనం లభిస్తుంటుంది. దీనితోనే ఇంటిల్లపాది నెట్టుకొస్తుంటారు. ఇతర మహిళలు కలుపుకుంటే దాదాపు రోజూ ఐదు వేలమంది ప్రయాణాలు చేస్తుంటారు. ఇలాంటి వారికి కూడా ఉచిత బస్సు ప్రయాణం ఎంతో మేలు చేస్తుంది. మరి ఇప్పటికైనా కూటమికి దయ కలుగుతుందో లేదో వేచి చూడాల్సిందే.

హామీ నిలబెట్టుకోవాలి

మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం సదుపాయం కల్పిస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు అవుతున్నా, ఎప్పటి నుంచి అమలు చేస్తారో తెలియడం లేదు. తెలంగాణాలో అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత బస్సు పథకాన్ని అమలు చేశారు. ఇక్కడ మాత్రం అబద్ధాలతోనే మేడలు కడుతున్నారు.

–సుశీల, పందిళ్లపల్లి

మార్టూరు హైవే పై తప్పిన ప్రమాదం

ధ్వంసమైన రెండు కార్లు

మార్టూరు: నిత్యం రద్దీగా ఉండే మార్టూరు జాతీయ రహదారిపై స్థానిక పెట్రోలు బంకు ఎదుట శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసం కాగా ప్రయాణికులకు పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన మాధవీ లత, శ్రీనివాసరావు దంపతులు తమ కారులో జె. పంగులూరు మండలం రామకూరు గ్రామానికి వెళ్లడం కోసం బొల్లాపల్లి టోల్‌గేట్ వైపు నుంచి మార్టూరు వస్తున్నారు. ఇదే మార్గంలో ఒంగోలు నుంచి విజయవాడ వైపు ఓ కియా కారు వీరి వెనుకనే వేగంగా వస్తుంది. శ్రీనివాసరావు తన కారును మార్టూరు సర్వీస్ రోడ్డులోపైకి వెళ్లటం కోసం స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో మలుపు వైపు తిప్పసాగాడు. ఆ వెనుకనే వేగంగా వస్తున్న కియా కారు డ్రైవరు ఈ పరిణామాన్ని ఊహించక ముందున్న కారును బలంగా ఢీ కొట్టి రహదారి మధ్యలోకి వెళ్లి ఆగిపోయాడు. ప్రమాద ధాటికి కియా కారులోని రెండు బెలూన్లు ఓపెన్ కావడంతో డ్రైవింగ్ సీటులోని వ్యక్తికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రమాద తీవ్రతకు శ్రీనివాసరావు దంపతుల కారు హైవే పక్కన డివైడర్ పై ఏర్పాటు చేసి ఉన్న ఐరన్ గ్రిల్‌లో ఇరుక్కుని ఎటూ కదలకుండా ఆగిపోయింది. ప్రమాదంలో మాధవీ లత, శ్రీనివాస్‌రావులకు స్వల్ప గాయాలు కాగా హైవే అంబులెన్స్ సిబ్బంది వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హైవే సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని ట్రాఫిక్‌కు అవరోధంగా ఉన్న రెండు కార్లను క్రేన్ సహాయంతో తొలగించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూశారు.



ప్రమాదంలో ఐరన్ గ్రిల్‌లో ఇరుక్కున్న శ్రీనివాసరావు దంపతుల కారు



ప్రమాద ధాటికి రహదారి మధ్యలో ఆగిపోయిన కారు

తాగునీటి పైపులైన్‌కు లీకులు

- వారం రోజులుగా తాగునీరు వృథా
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మున్సిపల్ ఆఫీసు రోడ్డులో పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకు

రేపల్లె: పైపులైన్‌కు వారం కిందట లీకు ఏర్పడి తాగునీరు వృథాగా పోతుంది. మున్సిపల్ అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో వారం రోజుల కిందట పైప్‌లైన్‌కు లీకు ఏర్పడింది. మరమ్మతులు చేసేందుకు భారీ గొయ్యి తీసి మట్టిని రహదారిపై పడవేసి వదిలేశారు. లీకును మాత్రం సరిచేయలేదు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే రహదారిలో లీకుని సరిచేసి తాగునీటి వృథాని అరికట్టడంతోపాటు ట్రాఫిక్ సమస్యను తీర్చాలని పట్టణ ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

12 నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్ : స్టూడెంట్ యూనియన్ ఆఫ్ నేషన్, కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 21 వరకు ఐఏఎస్ ఫౌండేషన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. శనివారం గుంటూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఐఏఎస్ ఫౌండేషన్ తరగతుల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 8, 9, 10వ తరగతులతో పాటు ఇంటర్ విద్యార్థులకు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు బ్రాడీపేట 2/6లోని యూటీఎఫ్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతాయని చెప్పారు. సివిల్ సర్వీసెస్, ఐఏఎస్ పరీక్షల పట్ల పాఠశాల స్థాయిలో అవగాహన కల్పించి సివిల్స్ పై లక్ష్యాన్ని కలిగించడమే ముఖ్య లక్ష్యంగా తరగతులు ఉంటాయని చెప్పారు. 10 రోజులపాటు నిపుణులు క్లాసులు బోధిస్తారని తెలిపారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి సర్వీస్‌లకు ఎంపిక కావడం ద్వారా ప్రజలకు సేవలు అందించవచ్చని విద్యార్థులకు వివరిస్తారని తెలిపారు.

కల్తీ మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నారు

వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ పరిశీలకులు వరికూటి అశోక్‌బాబు



సాక్షి ప్రతినిధి,బాపట్ల: కూటమి ప్రభుత్వం కల్తీ మద్యంతో పేద ప్రజల ఆరోగ్యాన్ని పాడుచేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ పరిశీలకులు వరికూటి అశోక్‌బాబు ధ్వజమెత్తారు. శనివారం ఆయన సాక్షితో మాట్లాడారు. జిల్లాలో మద్యం షాపుల యజమానులు విచ్చలవిడిగా బెల్టు దుకాణాలతో పాటు పర్మిట్ రూములు ఏర్పాటుచేసి పేదల ఆరోగ్యాన్ని పీల్చి పిప్పిచేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. బెల్టు దుకాణాలు, పర్మిట్ రూముల్లో మద్యాన్ని కల్తీ చేస్తున్నారన్నారు. మద్యం తాగిన వారి ఆరోగ్యం క్షీణించే ప్రమాదముందన్నారు. పేరుకు క్వాలిటీ మద్యం అందిస్తామంటూ ప్రచారం చేసుకొని తక్కువ క్వాలిటీ మద్యాన్ని బాటిళ్లలో నింపి క్వాలిటీ మద్యంగా ప్రచారం చేస్తున్నారని వరికూటి ఆరోపించారు. వీధికి రెండు మూడు బెల్టు షాపులు అందుబాటులోకి తీసుకు రావడంవల్ల ప్రజలు మరింతగా మద్యం తాగేందుకు అలవాటు పడుతున్నారన్నారు. బెల్టు షాపుల ఏర్పాటు చేస్తే బెల్టుతీస్తానని ప్రకటించిన చంద్రబాబుకు ఒక్కో జిల్లాలో రెండు వేలకు తగ్గకుండా ఏర్పాటైన బెల్టు దుకాణాలు ఎందుకు కనిపించడంలేదంటూ వరికూటి ప్రశ్నించారు. పేదలను ఆరోగ్యంతోపాటు ఆర్థికంగా చితికి పోయేలా చేస్తున్న బెల్టు దుకాణాలను తక్షణం తొలగించాలని ప్రతిపక్ష పార్టీగా వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నాసిరకం మద్యం అమ్ముతున్నారంటూ నాడు టీడీపీ తప్పుడు ప్రచారం చేసి బురదజల్లి వరికూటి విమర్శించారు. ఇప్పుడు ఇంటికొక బెల్టు దుకాణం పెట్టి కూటమి ప్రభుత్వం చేస్తున్నదేందని ఆయన ప్రశ్నించారు. పచ్చ పార్టీ నేతలకు ఆదాయం కట్టబెట్టేందుకే విచ్చలవిడిగా బెల్టు దుకాణాలకు అనుమతులిస్తున్నారని విమర్శించారు. తక్షణం జిల్లాలోని బెల్టు దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే తాను ఉద్యమానికి సిద్ధం కావాల్సి వస్తుందన్నారు. బెల్టుదుకాణాలు, కల్తీమద్యంపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతుందని అశోక్‌బాబు హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

పార్టీ నాయకులతో ప్రకాశం జిల్లా పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి



బత్తులను సత్కరిస్తున్న నాయకులు

యద్రంవారిపాలెం (కారంచేడు): రాబోయే రోజుల్లో పర్చూరు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసేలా చేసి, పార్టీ బలోపేతానికి నాయకులంతా సమన్వయంగా పనిచేయాలని ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం యద్రంవారిపాలెంలోని ఆయన స్వగృహంలో నియోజకవర్గస్థాయి పార్టీ నాయకులతో మాట్లాడారు. అన్ని ప్రాంతాల అభివృద్ధికి, ప్రధానంగా పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు అండగా ఉండేలా నాయకులు కృషి చేయాలన్నారు.

ప్రకాశం జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేలా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొనేలా కష్టపడి పనిచేస్తానన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసుకోవడమే మనందరి లక్ష్యంగా కృషి చేయాలన్నారు. పేద ప్రజల పక్షాన ప్రభుత్వంతో పోరాడాల్సి ఉందన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ అమలు జాడ కనిపించడం లేదన్నారు. ఇచ్చిన హామీల్లో ఒక్కదానిని కూడా అమలు చేయకుండాలనే లక్ష కోట్ల అప్పులు చేసిన కూటమి ప్రభుత్వం వైఖరిని ఆయన దుయ్యబట్టారు.

బత్తులను సత్కరించిన నాయకులు

పార్టీ అధ్యక్షుని ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకునిగా నియామకం పొంది.. మొదటిసారిగా స్వగ్రామానికి వచ్చిన బత్తుల బ్రహ్మానందరెడ్డిని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు సత్కరించి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. పార్టీలో మొదటి నుంచి ఉంటూ, ఈ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, భవిష్యత్తులో పార్టీలో మరిన్ని పదవులు అలంకరించి రాష్ట్ర ప్రజలకు, పార్టీకి అండగా నిలబడాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో కారంచేడు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావు, మాజీ ఉపాధ్యక్షుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు, బాపట్ల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోట శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు మలినేడి జగన్నాథం, లంకా శివ, పంగులూరి నాగేశ్వరరావు, మాజీ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ యాద్దనపూడి హరిప్రసాద్, వేణుగోపాలస్వామి దేవస్థాన చైర్మన్ రావువారి ప్రసాద్, దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భవనం రాజగోపాలరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్



సమావేశంలో మాట్లాడుతున్న మజుందార్

బాపట్లటౌన్: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ విమర్శించారు. పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఈనెల 20న దేశవ్యాప్తంగా సమ్మెను చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ సమ్మెలో ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలన్నారు. జిల్లాలోని కార్మిక సంఘాల నాయకులతో ఈనెల 7న అంబేద్కర్ భవన్‌లో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు మేకల ప్రసాద్ మాట్లాడుతూ సమ్మెను జయప్రదం చేసేందుకు అన్ని మండలాల్లో సదస్సులు జరపాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శామ్యూల్ మాట్లాడుతూ ఈనెల 18,19 తేదిల్లో జిల్లాలో అన్ని మండలాలు, కేంద్రాలు పట్టణాల్లో సమ్మె జయప్రదం కోసం మోటార్ సైకిల్ ర్యాలీలు, గేటు మీటింగ్స్ నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు బి తిరుమలరెడ్డి, కే శరత్, ఏఐటీయూసీ నాయకులు సింగరకొండ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పి రేఖ, శ్రీవాణి పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



మృతుడు నరసింహారావు

రేపల్లె: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రేపల్లె పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ మల్లికార్జునరావు కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన బిళ్లా నరసింహారావు (30) తన భార్య సాయిదేవితో కలిసి రెండో వార్డులో 8 నెలల నుంచి అద్దెకు నివాసం ఉంటున్నాడు. పట్టణంలోని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పని చేస్తున్నారు. రెండు రోజుల కిందట ఉద్యోగాన్ని మానేశాడు. ఈ విషయంపై భార్యాభర్తలు గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన నరసింహారావు శుక్రవారం రాత్రి ఇంటిలో ఫ్యాన్ ఉగ్గికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. మృతుడి తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

షాక్‌తో కాంట్రాక్టు విద్యుత్ కార్మికుడు మృతి



విద్యుత్ స్తంభంపై మృతి చెందిన జడా సునీల్

చీరాల: విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో కాంట్రాక్టు విద్యుత్ కార్మికుడు మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం పేరాల జక్కావారివీధిలో చోటుచేసుకుంది. చీరాల మండలం విజయనగర్ కాలనీకి చెందిన జడా సునీల్ (21) విద్యుత్ శాఖలో కాంట్రాక్టు విద్యుత్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో పేరాల్లోని జక్కా వారి వీధిలో విద్యుత్ స్తంభంపై పనులు చేస్తున్నారు. విద్యుత్ సరఫరా నిలిపివేసిన తర్వాతనే స్తంభంపై లైన్ల మరమ్మతుల పనులు చేస్తుంటారు. అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి పనులు చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా రావడంతో అతడు అక్కడికక్కడే విద్యుత్ లైన్లపై పడిపోయాడు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని దించి చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంపై విద్యుత్ డీఈఈ హరిప్రసాదరావును అడగ్గా విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం పనులు చేస్తున్నామని, సరఫరా నిలిపివేసినా షార్టు అయి విద్యుత్ సరఫరా అయిందన్నారు. ఈ ఘటన ఎలా జరిగిందనేది తెలుసుకుంటున్నామన్నారు.

ఆర్మీ ఉద్యోగి మృతి

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరుకు చెందిన ఆర్మీ ఉద్యోగి నార్ల నరేష్(34) ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. నరేష్ పంజాబ్‌లోని పటాన్ కోటలో పని చేస్తున్నాడు. శుక్రవారం జరిగిన ప్రమాదంలో అతను మృతి చెందినట్లు అమర్తలూరు ఎస్ఐ జానకి అమర్‌వర్ధన్ శనివారం తెలిపారు. భార్య కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నరేష్ భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం స్వగ్రామానికి తీసుకురానున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం అంత్యక్రియలు గ్రామంలో నిర్వహిస్తారని తెలిపారు.